

సస్పెన్షన్ ఎత్తివేయాలి..
ఒకే పోలీస్ విధానాన్ని అమలు చేయాలని, సస్పెన్షన్ ఎత్తివేయాలని బెటాలియన్ కానిస్టేబుళ్లు డిమాండ్ చేశారు.
- 10లో ▸



నేడు బాబ్లీ గేట్ల మూసివేత
ఎస్సారెస్పీ ఎగువన మహారాష్ట్రలో ఉన్న బాబ్లీ గేట్లను సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం నేడు మూసివేయనున్నారు.
- 10లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం 31.0 /18.9
ఉదయం ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది. మంచు కురుస్తుంది. చలి తీవ్రత పెరిగే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

కార్పొరేషన్ కమిషనర్‌గా దిలీప్ కుమార్

- సీసీఎల్‌ఏ ప్రాజెక్టు డైరెక్టర్‌గా మంద మకరందు బదిలీ



దిలీప్‌కుమార్

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ మంద మకరందును బదిలీ చేస్తూ ప్రభుత్వం సోమ వారం ఉత్తర్వులు జారీచేసింది. మకరందు సీసీఎల్ఏ ప్రాజెక్టు డైరెక్టర్ (పీడీ)గా నియమితులయ్యారు. ఆయన స్థానంలో మేడ్చల్ జిల్లా జెడ్పీ సీఈవోగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఎస్.దిలీప్ కుమార్‌ను నియమించారు. మకరందు గతేడాది జూలై 18న కార్పొరేషన్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టారు. నూతన కమిషనర్ దిలీప్ మంగళవారం బాధ్యతలు స్వీకరించనున్నారు.

విజిలెన్స్ వారోత్సవాలు ప్రారంభం



సుభాష్‌నగర్: విజిలెన్స్ అవగాహనా వారోత్సవాల్లో భాగంగా టీజీఎన్‌పీడీసీఎల్ పరిధిలోని జిల్లా విజిలెన్స్, ఏపీటీఎస్ పోలీస్‌స్టేషన్‌లో మొదటిరోజు సోమవారం ప్రతిజ్ఞ చేశారు. దేశ ఆర్థిక వ్యవస్థను ఆటంకపరిచే పనులకు, అవినీతికి దూరంగా ఉంటామని, దేశాభివృద్ధికి దోహదపడతామని ఏపీటీఎస్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ గోవర్ధన్‌రెడ్డి సిబ్బంది, స్థానికులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎస్సై భరత్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

సుభాష్‌నగర్: విజిలెన్స్ వారోత్సవాల సందర్భంగా నగరంలోని పాలిటెక్నిక్ కళాశాలలో పవర్ గ్రిడ్ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు సోమవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం పవర్ గ్రిడ్ నిర్వాహకులు జయంత్‌రెడ్డి మాట్లాడుతూ.. అవినీతి నిర్మూలనలో విద్యార్థులు భాగస్వాములు కావాలని, దేశంలో ఎక్కడా అవినీతి లేకుండా ఇప్పటి నుంచే విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పాలిటెక్నిక్ కళాశాల హెచ్‌వోడీ నితిన్ పవార్, రాంచందర్‌తోపాటు పవర్ గ్రిడ్ ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీసుల క్యాండిల్ ర్యాలీ



ఖలీల్‌వాడి: పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం (పోలీసు ఫ్లాగ్ డే)ను పురస్కరించుకొని ఇన్‌చార్జి సీపీ సింధుశర్మ ఆదేశాల మేరకు డీసీపీ(అడ్మిన్) కోటేశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు.

ఎల్ఐసీ చౌరస్తా నుంచి ప్రారంభమైన ర్యాలీ మున్సిపల్ కార్యాలయం, ఎన్టీఆర్ చౌరస్తా, పోలీస్ హెడ్ క్వార్టర్స్ వరకు కొనసాగింది. కార్యక్రమంలో డీసీపీ (ఏఆర్) శంకర్‌నాయక్, ట్రాఫిక్ ఏసీపీ నారాయణ, ఆర్మ్‌డ్ రిజర్వ్ ఏసీపీ నాగయ్య, టౌన్ సీఐ శ్రీనివాస్ రాజ్, రిజర్వ్ సీఐలు సతీశ్‌కుమార్, తిరుపతి, శ్రీనివాస్, ఎస్‌బీ సీఐ ప్రసాద్, సీఐలు, ఎస్సైలు, రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ బుస్సా ఆంజనేయులు, కోశాధికారి కరిపె రవీందర్, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు షకీల్ పాషా, పోలీస్ సిబ్బంది, స్పెషల్ పార్టీ సిబ్బంది, అమరవీరుల కుటుంబాల సభ్యులు పాల్గొన్నారు.

నేడు స్పెషల్ ఎడ్యుకేషన్ కౌన్సెలింగ్

నిజామాబాద్‌అర్బన్: స్పెషల్ ఎడ్యుకేషన్ ఎస్జీటీ విభాగంలో ఎంపికైన అభ్యర్థులకు మంగళవారం కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. 1:3 ప్రకారం అభ్యర్థుల ధృవపత్రాల పరిశీలన చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు కలెక్టరేట్ ఆవరణలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అభ్యర్థులు హాజరుకావాలని సూచించారు. తమ వెంట ఒరిజినల్ ధ్రువపత్రాలతోపాటు రెండు జిరాక్స్ సెట్లు, గెజిటెడ్ అధికారి సంతకంతో ధ్రువీకరణ చేయించుకోవాలని, ఆరు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు జత చేయాలని అభ్యర్థులకు సూచించారు.

సిరి సంపదల ధనత్రయోదశి

బంగారం, వెండి కొనుగోళ్లకు ప్రత్యేకమైన రోజు

- వస్త్రాలు, విలువైన వస్తువులకు గిరాకీ
- మార్కెట్‌కు దీపావళి కళ

దీపావళి ముందురోజు వచ్చే ధనత్రయోదశి లక్ష్మీ దేవికి ఎంతో ప్రీతికరమని హిందువుల నమ్మకం. దీనినే ధన్‌తేరస్, చోటీ దివాళీ అని కూడా అంటారు. ఈ రోజున లక్ష్మీదేవిని పూజిస్తే ఇంట్లో సిరి సంపదలకు లోటు ఉండదని అంటారు. ఇందులో భాగంగా ప్రత్యేకంగా బంగారం, వెండి, నూతన వస్త్రాలు, విలువైన వస్తువులను కొనుగోలు చేస్తారు. ధనత్రయోదశి, దీపావళిని పురస్కరించుకొని మార్కెట్ కళకళలాడుతోంది. మంగళవారం ప్రత్యేక పూజలు, దీపాలను వెలిగించి అమ్మవారికి స్వాగతం పలికేందుకు మహిళలు సిద్ధమవుతున్నారు.
– నిజామాబాద్ రూరల్



పురాణాల్లోని ఓ కథ ధనత్రయోదశి నేపథ్యాన్ని తెలుపుతోంది. వివాహమైన నాలుగో రోజు మరణిస్తాడని హిమ రాజు కుమారుడి జాతకంలో ఉంటుంది. రాకుమారుని మరణం 16వ ఏట తథ్య మని జ్యోతిష్యులు తెలుపుతారు. ఓ రాజకుమారితో అతడి వివాహం జరిపించిన హిమరాజు.. తన కుమారుడికి ఉన్న ప్రాణగండం గురించి కోడలికి తెలుపుతాడు. తన భర్తను మృత్యువు నుంచి కాపాడుకునేందుకు రాజకుమారి తన పెళ్లైన మూడో రోజు త్రయోదశి రోజున ఆమె లక్ష్మీదేవిని పూజించి, బంగారు, వజ్రాభరణాలను ఓ పెట్టెలో ఉంచి గుమ్మం ముందు దీపాలు వెలిగించి భర్తతోపాటు జాగారం చేసింది. మర్నాడు ఉదయం యమ ధర్మరాజు ఆ గుమ్మం ముందుకు వచ్చేటప్పటికీ ఆ దీపాల వెలుగులో ఆయన చూపు మసకబారి లోనికి ప్రవేశించలేకపోయాడు. ఆ ప్రాంతం నుంచి యముడు మెల్లగా వెళ్లిపోయాడు. తెలివిగా వ్యవహరించిన ఆ రాజకుమారి తన భర్త ప్రాణాలు దక్కించుకుంది. ఈ ఘటన త్రయోదశి నాడు చోటుచేసుకోవడంతో ఆ రోజు నుంచి 'ధనత్రయోదశి'ని నిర్వహిస్తున్నారు.

మరో కథ..

విష్ణువు భృగు మహర్షి కాళ్లు పట్టుకోవడం, అంతకు ముందు తన నివాసమైన విష్ణువు గుండెలపై భృగు కాలితో తన్నడం నచ్చని లక్ష్మీదేవి అలిగి భూమిపైకి వచ్చింది. అశ్వీయుజ బహుళ త్రయోదశి అమ్మవారు భూమి పై ఉన్న కరవీరపురానికి (కొల్హాపూర్) చేరినట్లు పు రాణాల్లో పేర్కొన్నారు. భూలోకానికి వచ్చిన లక్ష్మీదేవి కుబేరుడు పూజించి, అమ్మవారి కరుణను పొందాడు. అమ్మవారు త్రయోదశి నాడు రావడంతో 'ధనత్రయోదశి' అయ్యింది.



నగరంలోని ఓ నగల షోరూమ్‌లో సందడి

బంగారం కొనుగోళ్లకు అత్యంత శుభప్రదం

బంగారం కొనుగోలుకు శుభప్రదమైన రోజుల్లో ధన త్రయోదశి ఒకటి. ధనత్రయోదశి రోజున పేదలకు భోజనం, వస్త్రం, ధనం దానం చేయాలి. లక్ష్మీదేవిని స్వర్ణ పుష్పాలతో అర్చించాలని చెబుతుందీ ధనత్రయోదశి. బంగారవంటి మనసుతో అర్చించినా లక్ష్మీకటాక్షం సిద్ధిస్తుంది. ధన త్రయోదశి సందర్భంగా బంగారు కొనుగోలు చేస్తారు. బంగారు కొనుగోళ్లతో మార్కెట్ సందడిగా మారనుంది.



ప్రభావం చూపనున్న ధరలు

ప్రస్తుతం మార్కెట్‌లో 24 క్యారెట్ల బంగారం ధర రూ.81,500 అలాగే 22 క్యారెట్ల ధర రూ.75,202గా ఉంది. అదే విధంగా వెండి కిలో రూ.1,02,000గా ఉంది. ధరలు పెరిగిన నేపథ్యంలో కొనుగోళ్లు అంతంతమాత్రంగానే ఉండొచ్చని వ్యాపారులు అంటున్నారు. షోరూముల్లో కొనుగోళ్లు ఎక్కువగా ఉండొచ్చని షోరూంల యజమానులు అంచనా వేస్తున్నారు.

బంగారం కొనడం ఆచారం



ధన త్రయోధవి రోజున ప్రతి ఒక్కరూ తమ ఇంట్లోకి నూతన వస్తువులను తీసుకురావడం ఆనవాయితీ. బంగారం, బంగారం ఆభరణాలు కొనుగోలు చేయడం ఆచారంగా వస్తోంది. తమ ఇళ్లల్లో ఏడాది మొత్తం ధనం, సంపదకు కొదవ ఉండదని నమ్మకం.
– సిలివేరి గణేశ్, శ్రీరాజరాజేశ్వరి జ్యువెల్లర్స్

లక్ష్మీనారాయణుడు వచ్చిన రోజు



ధన త్రయోదశి నాడు ప్రతి ఇంటికి లక్ష్మీనారాయణుడు వస్తాడని నమ్మకం. దీంతో ప్రతి ఒక్కరూ బంగారంతోపాటు నూతన వస్త్రాలను కొనుగోలు చేస్తారు. ఈ పండుగను ఎక్కువగా మార్వాడీలు, గుజరాతీలు జరుపుకుంటారు. గతంలో ఐదు రోజుల పాటు దీపావళి పండుగ జరుపుకునేవారు.
– చిలుముల భూషణ్‌చారి, ఆభరణాల తయారీదారు

శుభం కలుగుతుంది



ప్రతి సంవత్సరం ధనత్రయోదశి రోజు ఎంతో కొంత బంగారాన్ని కొనుగోలు చేస్తాను. ఈ సంవత్సరం కూడా బంగారం కొనాలని ధన త్రయోదశి కోసం ఎదురుచూస్తున్నాం. బంగారం కొనుగోలు చేస్తే ఎంతో శుభమని భావిస్తాం. ఈ ఏడాది ధరలు బాగా పెరిగాయి. – నవనీత, గృహిణి

మరిన్ని ఇబ్బందుల్లోకి..

- రైల్వే లైన్ సర్వే బృందాన్ని అడ్డుకున్న శ్రీఅశోక ఎన్‌క్లేవ్ బాధితులు
- కేసులు ఎదుర్కోక తప్పని పరిస్థితి
- ప్లాట్లు అమ్ముకుని తప్పుకున్న రియల్టర్లు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: ఇప్పటికే బాధితులుగా మారిపోయారు. పైగా మరిన్ని ఇబ్బందులను కొనితెచ్చుకునే స్థితిలోకి వెళుతున్నారు. ఇదీ నిజామాబాద్ రైల్వే బైపాస్ రోడ్డులోని శ్రీ అశోక ఎన్‌క్లేవ్ పేరిట వేసిన లేఅవుట్‌లో ప్లాట్లు కొన్న బాధితుల పరిస్థితి. రైల్వే లైన్‌కు 100 మీటర్ల దూరంలో ఎలాంటి లేఅవుట్లు వేయకూడదన్న నిబంధనలను ఉల్లంఘించి వేసిన ఈ వెంచర్‌లో పలువురు సామాన్యులు, ఉద్యోగులు ప్లాట్లు కొనుక్కున్నారు. ఈ లేఅవుట్‌కు సంబంధించి నుడా నుంచి అనుమతులు, విద్యుత్ శాఖ ద్వారా లేఅవుట్‌లో పూర్తిస్థాయిలో విద్యుత్ లైన్ సైతం ఏర్పాటు చేయించారు. ఇవన్నీ ఆగమేఘాల మీద పూర్తిచేశారు. సదరు వెంచర్ వేసిన అశోక ఎన్‌క్లేవ్ వాళ్ల వద్ద భారీగా ముడుపులు తీసుకున్న అధికారులు ఆగమేఘాల మీద అన్ని అనుమతులు ఇచ్చినట్లు పలువురు ఆరోపిస్తున్నారు. ఇలాంటి నేపథ్యంలో అధికారులు ఇచ్చిన అనుమతులన్నీ సరైనవేనా అనే అనుమానాలు కలుగుతున్నాయి. పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ భూములు, రైల్వే జోన్‌లోని భూములు, విమానాశ్రయ రేడియస్‌లోని భూముల విషయంలో కచ్చితమైన నిబంధనలు ఉంటాయి. ఇవన్నీ తెలిసినప్పటికీ నిజామాబాద్‌లోని బైపాస్ రోడ్డులోని రైల్వే లైన్ పక్కన, రైల్వే జోన్ భూముల్లో శ్రీఅశోక ఎన్‌క్లేవ్ పేరిట లేఅవుట్ వేయడమే తప్పు. ఇలాంటి వెంచర్‌కు అనుమతులు ఇచ్చిన అధికారులు మరింత పెద్ద తప్పు చేశారు. ఇక్కడ కొనుగోలు చేసినవారు సైతం నిబంధనలు తెలుసుకోకపోవడం మరో తప్పిదం. పైగా రైల్వే శాఖ చేస్తున్న సర్వేను సోమవారం అడ్డుకున్నారు. ఇది మరో పెద్ద తప్పిదం. రైల్వే పనులను అడ్డుకుంటే క్రిమినల్ కేసులు ఎదుర్కోక తప్పని పరిస్థితి. అయినప్పటికీ అడ్డుకోవడం గమనార్హం.



■ రైల్వే జోన్ అని తెలిసినప్పటికీ శ్రీఅశోక ఎన్‌క్లేవ్ ఏర్పాటు చేశారు. ఇలా వెంచర్ వేసిన వాళ్లను విచారించాలి. దీనికి అనుమతులు ఇచ్చిన అధికారులను సైతం ప్రాసిక్యూట్ చేయాల్సి ఉందని పలువురు అంటున్నారు. పైగా రైల్వే లైన్‌ను రద్దు చేయిస్తామంటూ లేఅవుట్ వేసిన ప్రబుద్ధులు మభ్యపెడుతుండడం గమనార్హం. ఈ క్రమంలో సర్వే పనులను అడ్డుకునేలా ప్రోత్సహించడం పట్ల పలు విమర్శలు వస్తున్నాయి. పైసా పైసా కూడబెట్టుకుని పిల్లల భవిష్యత్తు చదువులు, ఆడపిల్లల వివాహాల కోసం పెట్టుబడి మాదిరిగా వీటిని కొనుగోలు చేశారు. ప్లాట్లు కొనుగోలు చేసినవారిలో చాలామందికి దాని కోసం చేసిన అప్పులు సైతం ఇంతవరకు తీరలేదు. దీంతో లబోదిబోమంటున్నారు. గత ప్రభుత్వంలో బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులతో అంటకాగిన శ్రీఅశోక ఎన్‌క్లేవ్ వాళ్లు ఇప్పుడు మాత్రం అధికార కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నాయకులు తమకు అత్యంత సన్నిహితులని ప్లాట్లు కొనుక్కున్నవారిని భయపెడుతున్నారు. దీంతో వీరంతా రైల్వే సర్వేను అడ్డుకునే సాహసానికి పాల్పడుతున్నారు. కేసులపాలైతే మరిన్ని ఇబ్బందులు పడాల్సిన పరిస్థితిని తెచ్చుకుంటున్నారు. ఈ విషయమై ఆర్డీవో రాజేంద్రకుమార్‌ను వివరణ కోరగా మంగళవారం పోలీసు ఫోర్స్‌తో దక్షిణ మధ్య రైల్వే హైదరాబాద్ డిప్యూటీ చీఫ్ ఇంజినీర్ నతానియేల్ ఆధ్వర్యంలో సర్వే జరుగుతుందన్నారు.



రైల్వే లైన్ సర్వే బృందాన్ని అడ్డుకుంటున్న ప్లాట్ల యజమానులు

సీడ్ ధాన్యానికి ధర ఎక్కువే..

- విత్తనోత్పత్తి కోసం రైతులతో సాగు చేయించిన కంపెనీలు
- క్వింటాల్‌కు రూ.2,500 ధర..
- బోనస్ ప్రకటన నేపథ్యంలో మరింత పెరిగే అవకాశం

మోర్తాడ్(బాల్కొండ): విత్తనోత్పత్తిలో భాగంగా కొన్ని సీడ్ కంపెనీలు రైతులతో సీడ్ వరిని సాగు చేయించాయి. బైబ్యాక్ ఒప్పందం మేరకు ముందుగా నిర్ణయించిన ధరను చెల్లించి తరలించేందుకు కంపెనీలు సిద్ధమయ్యాయి. మోర్తాడ్, కమ్మర్‌పల్లి, ఏర్గట్ల, బాల్కొండ, ముప్కాల్, మెండోరా, వేల్పూర్, జక్రాన్‌పల్లి, ఆర్మూర్, నందిపేట్ తదితర మండలాల్లో సీడ్ ధాన్యాన్ని ప్రైవేట్ కంపెనీలు సాగు చేయించాయి. సన్న రకాలతోపాటు కొన్ని దొడ్డు రకాలను సీడ్ కోసం సాగు చేయించగా క్వింటాల్‌కు రూ.2,500 చెల్లించేందుకు గతంలోనే ఒప్పందం కుదుర్చుకున్నారు. సన్న రకాలకు ప్రభుత్వం రూ.500 బోనస్‌ను ప్రకటిస్తే సీడ్ ధాన్యానికి మరింత ధర పెంచుతామని కంపెనీలు గతంలోనే హామీ ఇచ్చాయి. సీడ్ ధాన్యాన్ని కంపెనీల కోసం రైతులు దాదాపు 1,500 ఎకరాల్లో సాగు చేసినట్లు అంచనా. ప్రస్తుత పరిస్థితుల్లో ఒప్పందం ప్రకారం ధర చెల్లించి బోనస్ ఆధారంగా అదనపు ధర చెల్లించే అవకాశం ఉంది. సీడ్ ఆర్గనైజర్లు అంతా లోకల్ వారు కావడంతో రైతులు తమకు కంపెనీల కన్నా వాటి ప్రతినిధులపైనే నమ్మకం అని చెబుతున్నారు. ప్రభుత్వం విత్తనోత్పత్తి కార్యక్రమాన్ని ప్రోత్సహించకపోయినా కంపెనీలు ఈ విధానాన్ని కొనసాగిస్తున్నాయి.



మోర్తాడ్‌లో రవాణాకు సిద్ధంగా ఉంచిన సీడ్ ధాన్యం బస్తాలు

డీసీసీబీ వైస్ చైర్మన్‌గా చంద్రశేఖర్‌రెడ్డి

- అభినందనలు తెలిపిన చైర్మన్ రమేష్‌రెడ్డి, డైరెక్టర్లు

సుభాష్‌నగర్: జిల్లా సహకార కేంద్ర బ్యాంకు వైస్ చైర్మన్‌గా బోర్గాం(పి) సొసైటీ చైర్మన్ నల్ల చంద్రశేఖర్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం జిల్లా ఎన్‌డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ఎన్నికల్లో నల్ల చంద్రశేఖర్‌రెడ్డి ఒక్కరే నామినేషన్ దాఖలు చేశారు. ఎన్నికల అధికారిగా వ్యవహరించిన కామారెడ్డి డీసీవో రామ్మోహన్ వైస్ చైర్మన్‌గా ఎన్నికైనట్లు చంద్రశేఖర్ రెడ్డికి నియామక పత్రం అందజేశారు. పది రోజుల క్రితం ఎన్నిక ప్రక్రియ చేపట్టినప్పటికీ నామినేషన్ దాఖలు కాకపోవడంతో వాయిదా పడిన విషయం తెలిసిందే. వైస్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన చంద్రశేఖర్ రెడ్డికి చైర్మన్ కుంట రమేష్‌రెడ్డి, సీఈవో నాగభూషణం వందే, డైరెక్టర్లు గొర్కంటి లింగం, గిర్దావర్ గంగారెడ్డి, శరత్‌తోపాటు మోపాల్ మండల నాయకులు, సీఈవోల అసోసియేషన్ ప్రతినిధులు, బ్యాంకు అధికారులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు.

ఏడు నెలలుగా ఖాళీగా..

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డిపై వైస్ చైర్మన్ కుంట రమేష్‌రెడ్డి సహా డైరెక్టర్లు అవిశ్వాసం పెట్టారు. అవిశ్వాసం నెగ్గడంతో వైస్ చైర్మన్‌కు ఇన్‌చార్జి చైర్మన్ బాధ్యతలు అప్పగించారు. ఆ తర్వాత చైర్మన్ పదవికి ఎన్నిక జరగగా, కుంట రమేష్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అప్పటి నుంచి వైస్ చైర్మన్ పదవి ఖాళీగా ఉంది. ఏడు నెలల తర్వాత వైస్ చైర్మన్ పదవికి ఎన్నికలు జరిగాయి.



చంద్రశేఖర్‌రెడ్డిని అభినందిస్తున్న చైర్మన్ రమేష్‌రెడ్డి, డైరెక్టర్లు

సీనియర్‌కు దక్కిన పదవి..

బోర్గాం(పి) గ్రామానికి చెందిన నల్ల చంద్రశేఖర్ రెడ్డి గత మూడు పర్యాయాలు సొసైటీ చైర్మన్‌గా ఎన్నికవుతున్నారు. ఈ పాలకవర్గంలో డీసీసీబీ డైరెక్టర్‌గా ఎన్నిక కాగా, తాజాగా వైస్ చైర్మన్‌గా అవకాశం దక్కింది. వైస్ చైర్మన్ పదవిని కామారెడ్డి జిల్లాకు కేటాయించాలని డిమాండ్ చేసినప్పటికీ.. సరైన బలం లేకపోవడంతో నల్ల చంద్రశేఖర్‌రెడ్డిని పదవి వరించింది. దీంతో డీసీసీబీ చైర్మన్, వైస్ చైర్మన్ పదవులు నిజామాబాద్ జిల్లాకే దక్కాయి.

సీఎం కోర్టులో బంతి

- పోలీస్ కమిషనర్ ఎవరనేదానిపై జోరుగా చర్చ
- తమకు అనుకూలమైన అధికారిని తెచ్చేందుకు కాంగ్రెస్ నేతల ప్రయత్నాలు
- ఇప్పటికే తెరపైకి పలువురి పేర్లు



ఖలీల్‌వాడి: నిజామాబాద్ పోలీస్ కమిషనర్‌గా ఎవరస్తారనే దానిపై జోరుగా చర్చ జరుగుతోంది. కల్మేశ్వర్ బదిలీపై వెళ్లిన తరువాత కామారెడ్డి ఎస్పీ సింధుశర్మకు ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించిన విషయం తెలిసిందే. కల్మేశ్వర్ బదిలీ అయిన మూడు రోజుల్లో కొత్త సీపీ వస్తారని అంతా భావించారు. దీనికితోడు పలువురి పేర్లు తెరపైకి వచ్చాయి. అయితే అధికార కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు తమకు అనుకూలమైన అధికారిని నియమించాలని సీఎం రేవంత్‌ను కోరగా, ఆయన సానుకూలంగా స్పందించినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ పరిణామాల నేపథ్యంలోనే సీపీ నియామకం ఇప్పటికీ ఓ కొలిక్కిరాలేదని, బంతి సీఎం కోర్టులో ఉందని అంటున్నారు.రాష్ట్ర వ్యాప్తంగా త్వరలోనే 10 మంది ఐపీఎస్‌ల బదిలీలు జరిగే అవకాశాలు ఉన్నట్లు పోలీస్‌వర్గాల ద్వారా తెలిసింది. ఆ బదిలీల సమయంలోనే నిజామాబాద్ కమిషనరేట్‌కు సీపీ వస్తారని, అప్పటి వరకు కామారెడ్డి ఎస్పీ సింధుశర్మ ఇన్‌చార్జిగా కొనసాగుతారని పలువురు పేర్కొంటున్నారు. డైరెక్ట్ ఐపీఎస్ వస్తారా లేక గ్రూప్ వన్ లేదా ఎస్సై నుంచి వచ్చిన (కంఫర్డ్) ఐపీఎస్ వస్తారా వేచి చూడాలి.

పరిశీలనలో..

సీపీగా ఎవరొస్తారనే చర్చ ఓ వైపు సాగుతుండగా మరో వైపు తెరపైకి పలువురి పేర్లు వచ్చాయి. శ్వేతరెడ్డి, కోటేశ్వర్‌రావు, కరుణాకర్, రామిరెడ్డి, రాహుల్ హెగ్డే, అనురాధతోపాటు మరికొంత మంది పేర్లు వినిపిస్తున్నాయి. అయితే సీపీగా వచ్చేందుకు తెరవెనుక నుంచి ప్రజాప్రతినిధుల సహకారమూ అవసరం ఉండడంతో సీఎం రేవంత్ నిర్ణయంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

నేడు బీసీ కమిషన్ రాక

- కలెక్టరేట్‌లో ప్రజాభిప్రాయ సేకరణ

నిజామాబాద్‌అర్బన్: రాష్ట్రంలో స్థానిక సంస్థల వారీగా కల్పించాల్సిన రిజర్వేషన్ల దామాషాపై ఆ యా రాజకీయ పార్టీలు, సంఘాలు, ప్రజల అభిప్రా యాలను సేకరించేందుకు తెలంగాణ బీసీ కమిషన్ సభ్యుల బృందం ఈ నెల 29న (మంగళవారం) నిజామాబాద్‌కు రానుందని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు సోమవారం తెలిపారు. ఉమ్మడి జిల్లా కు సంబంధించి నిజామాబాద్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్)లో కమిషన్ చైర్మన్ నిరంజన్ నేతృత్వంలో బృందం ప్రజాభిప్రాయాలను సేకరించనున్నట్లు తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిజామాబాద్ జిల్లాకు చెందిన వారు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు కామారెడ్డి జిల్లాకు చెందిన వారు అభిప్రాయాలను తెలియజేయొచ్చని సూచించారు. నిర్దేశిత నమూనాలో వెరిఫికేషన్ అఫిడవిట్‌తోపాటు ఆరు సెట్లను తెలుగు లేదా ఇంగ్లిష్‌లో ఇవ్వాల్సి ఉంటుందని, వాదనలకు మద్దతుగా సమాచారం, సాక్ష్యాలను, సంబంధిత కేసుల వివరాలను పేర్కొంటూ, సమర్పణలు, అభ్యర్థనలు, సలహాలు, ఆక్షేపణలను కమిషన్ కు నివేదించాలన్నారు. ప్రజాభిప్రాయసేకరణ కోసం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.

సౌత్‌జోన్ కబడ్డీ టోర్నీకి జీజీ విద్యార్థులు

నిజామాబాద్‌నాగారం: సౌత్ జోన్ కబడ్డీ ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్‌కు జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ కళాశాల విద్యార్థులు డి నరేశ్, పి సిద్ధార్థ, ఆర్ నరేశ్ ఎంపికయ్యారు. ఈ నెల 30 నుంచి నవంబర్ 4వ తేదీ వరకు చెన్నైలో నిర్వహించనున్న టోర్నీలో వారు పాల్గొననున్నారు. క్రీడాకారులను ప్రిన్సిపాల్ డాక్టర్ రామ్మోహన్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ గంగారత్నం, పీడీ బాలమణి అభినందించారు.



ఉపాధి పేరిట ఏజెంట్ల మోసం

- తాజాగా ఏజెంట్‌ చేతిలో దగాపడ్డ మంచిప్ప యువకుడు
- కిర్గిస్థాన్‌ పంపిస్తానని రూ.1.80 లక్షలు వసూలు
- ఢిల్లీలో వారం ఉంచిన వైనం
- 10 రోజులు అష్టకష్టాలు పడి ఇంటికి చేరిక

మోపాల్‌: జిల్లాలో గల్ఫ్‌ ఏజెంట్ల మోసాలు ఆగడం లేదు. అమాయక నిరుద్యోగ యువతను నమ్మించడం.. విదేశాల్లో ఉద్యోగం అవకాశం కల్పిస్తామంటూ ఆశలు రేకెత్తించడం.. వారి నుంచి అందిన కాడికి దండుకోవడం.. ఆ తర్వాత రాత్రికి రాత్రే బోర్డు తిప్పేయడం వంటి ఘటనలు జిల్లాలో అనేకం చోటు చేసుకుంటున్నాయి. విదేశాల్లోని కంపెనీలతో ఒప్పందాలు లేకుండానే ఉద్యోగాలు కల్పిస్తామంటు మోసాలకు పాల్పడుతున్నారు. విసిటింగ్‌ వీసా పేరిట వెళ్లడం అక్కడ ఉపాధి లభించక ఇబ్బందులు పడుతున్నారు. ఏజెంట్ల మోసాలతో భారీగా నష్టపోతున్నారు. తాజాగా మంచిప్పలో ఓ యువకుడు ఏజెంట్‌ చేతిలో మోసపోయి చివరికి అష్టకష్టాలు పడి పది రోజులకు ఢిల్లీ నుంచి స్వగ్రామానికి చేరుకున్నాడు.

మోపాల్‌ మండలంలోని మంచిప్పకు చెందిన కొర్వ కిషన్‌ కూరగాయలు విక్రయిస్తూ జీవనం సాగించేవాడు. గతంలో ఉపాధి కోసం పలుమార్లు గల్ఫ్‌ దేశాలకు వెళ్లి వచ్చాడు. మరోసారి ఉపాధి నిమిత్తం కిర్గిస్థాన్‌ వెళ్లేందుకు మెట్‌పల్లికి చెందిన ఏజెంట్‌ నందుతో ఒప్పందం కుదుర్చుకున్నారు. రూ.2.50లక్షలకుగాను రూ. 1.80 లక్షలు ఏజెంట్‌కు ఇచ్చాడు. అతను డూప్లికేట్‌ జిరాక్స్‌ వీసా కాపీ మాత్రమే ఇచ్చి ఈ నెల 19న కిర్గిస్థాన్‌ వెళ్లాల్సి ఉంటుందని చెప్పాడు. దీంతో కిషన్‌ అక్టోబర్‌ 17న హైదరాబాద్‌ నుంచి ఢిల్లీకి చేరుకుని ఏజెంట్‌ చెప్పిన హోటల్‌లో దిగాడు. అప్పటికే మరో నలుగురు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారు హోటల్‌కు వచ్చారు. వారితో కలిసి ఉన్న కిషన్‌ ఏజెంట్‌కు ఎంత చెల్లించారు.. ఇతర విషయాలు పంచుకున్నారు.



తల్లితో బాధను పంచుకుంటున్న కిషన్‌

ఐదు రోజులు గడిచినా..

కిషన్‌ ఢిల్లీకి చేరుకుని ఐదు రోజులు గడిచినా ఏజెంట్‌ రేపు.. మాపు అంటూ కాలయాపన చేశాడు. హోటల్‌, తిండి ఖర్చులు అధికం కావడంతో అయోమయానికి గురయ్యాడు. అటు కిర్గిస్థాన్‌ వెళ్లక, ఇటు ఖర్చులు పెరగడంతో మనోవేదన చెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబీలు తెలిసిన వారిని కిషన్‌ వద్దకు పంపించారు. మరో రెండ్రోజులు గడిచినా వీసా ఇవ్వకపోవడం, ఏజెంట్‌ రాకపోవడంతో హోటల్‌ నుంచి బయటికి వచ్చి రోడ్డుపై తిరిగాడు. అనుమానాస్పదంగా తిరుగుతున్న కిషన్‌ను ఢిల్లీ పోలీసులు ప్రశ్నించి స్టేషన్‌కు తరలించారు. అప్పటికే బ్యాగు, బట్టలు, సెల్‌ఫోన్‌, పాస్‌పోర్ట్‌, పర్సు అన్ని పోగొట్టుకున్న కిషన్‌ను పోలీసులు తీవ్రంగా కొట్టినట్లు తెలిసింది.

24న అర్ధరాత్రి పోలీసులు వదిలేయడంతో దిక్కుతోచని స్థితిలో ఆటోవాలా సెల్‌ఫోన్‌ నుంచి కుటుంబసభ్యులకు ఫోన్‌ చేశాడు. కుటుంబీకులు ఆటోవాలాకు డబ్బులు పంపించి, కిషన్‌ యోగక్షేమాలు చూసుకోవాలని కోరారు. ఎట్టకేలకు తన బామ్మర్ది సాయి, మిత్రుడు ఢిల్లీకి చేరుకొని ఆటోవారి సాయంతో కిషన్‌ వద్దకు చేరుకున్నారు.

విమానం అత్యవసర ల్యాండింగ్‌

ఢిల్లీ నుంచి కిషన్‌ను హైదరాబాద్‌కు తీసుకొచ్చేందుకు వారు విమానం ఎక్కారు. ఫ్లైట్‌ టేకాఫ్‌ తీసుకున్న తర్వాత కిషన్‌ మానసిక ఇబ్బందులకు గురయ్యాడు. వింతగా ప్రవర్తించడంతో పైలెట్‌ విమానాన్ని అత్యవసరంగా జైపూర్‌లో ల్యాండ్‌ చేసి పోలీసులకు అప్పగించారు. వారు కిషన్‌ను అక్కడి ఆస్పత్రిలో చికిత్సలు చేయించి తిరిగి జైపూర్‌ నుంచి హైదరాబాద్‌కు విమానంలో తీసుకొచ్చారు. ప్రస్తుతం కిషన్‌ మంచిప్పలో కుటుంబ సభ్యులను కలిసిన తర్వాత ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నాడు. కిషన్‌కు తల్లి రాజవ్వ, భార్య వసంత, కుమార్తె, కుమారుడు ఉన్నాడు.

ఏజెంట్‌ మోసం చేశాడు

నన్ను కిర్గిస్థాన్‌ పంపిస్తానని ఏజెంట్‌ నమ్మించి రూ.1.80లక్షలు తీసుకున్నాడు. ఢిల్లీకి వెళ్లిన తర్వాత మోసపోయానని తెలుసుకున్నాను. తీవ్ర మనోవేదనతో ఏం చేశానో నాకేం అర్థం కాలేదు. చివరకు బంధువులు వచ్చి నన్ను ఇంటికి తీసుకొచ్చారు.

– కొర్వ కిషన్‌, మంచిప్ప

మాకు న్యాయం చేయండి

ఏజెంట్‌కు చెల్లించిన రూ.1.80లక్షలతోపాటు అదనంగా ఖర్చయిన డబ్బులను అధికారులు స్పందించి ఏజెంట్‌ ద్వారా మాకు ఇప్పించాలి. మరొకరు మోసపోకుండా పోలీసులు, అధికారులు ఏజెంట్లను శిక్షించాలి. తీవ్రంగా నష్టపోయాం.. మాకు న్యాయం చేయండి.

– వసంత, కిషన్‌ భార్య

నేడు 'బాబ్లీ' గేట్ల మూసివేత

బాల్కొండ: శ్రీరాంసాగర్‌ ప్రాజెక్ట్‌కు ఎగువన మహారాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన బాబ్లీ ప్రాజెక్ట్‌ గేట్లను సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం మంగళవారం త్రిసభ్య కమిటీ సభ్యుల పర్యవేక్షణలో మూసి వేయనున్నారు. ఎగువ ప్రాంతాల నుంచి వరద వస్తుండడంతో ఎస్సారెస్పీకి 14 వేల క్యూసెక్కుల వరద వచ్చి చేరింది. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం బాబ్లీ గేట్లను ప్రతి ఏడాది జూలై 1న తెరిచి, అక్టోబర్‌ నెల 29న మూసివేయాలి. పరివాహక ప్రాంతాల్లో నిలిచిన నీరుకు బదులుగా మార్చి 1న బాబ్లీ గేట్లు ఎత్తి 0.6 టీఎంసీల నీటిని వదలాలి. ఈ నెల 28న అర్ధరాత్రి గేట్లను మూసేయాలి. కానీ త్రిసభ్య కమిటీ సభ్యులు వెళ్లడం ఇబ్బంది కావడంతో ప్రతి ఏడాది అక్టోబర్‌ 29న ఉదయం గేట్లను మూసివేస్తున్నారు. బాబ్లీ గేట్లు మూసివేతతో ఎగువ ప్రాంతాల నుంచి ఎస్సారెస్పీకి వరదలకు బ్రేక్‌ పడనుంది. 14 గేట్లతో ఎస్సారెస్పీకి ఎగువన 80 కిలోమీటర్ల దూరంలో బాబ్లీ ప్రాజెక్ట్‌ను మహారాష్ట్ర ప్రభుత్వం నిర్మించింది. ఎస్సారెస్పీ అధికారులు, నాందేడ్‌ ఇరిగేషన్‌ అధికారులు, సీడబ్ల్యూసీ అధికారులు త్రిసభ్య కమిటీలో సభ్యులుగా ఉన్నారు. ఉదయం 11 గంటలకు బాబ్లీ గేట్లను మూసివేతకు అధికారులు సిద్ధం చేశారు.



సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం ..

సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం మంగళవారం ఉదయం బాబ్లీ గేట్లను మూసి వేస్తాం. బాబ్లీ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి వరద వచ్చి చేరుతోంది. కానీ సుప్రీం తీర్పును గౌరవిస్తూ గేట్ల మూసివేతపై త్రిసభ్య కమిటీ సభ్యులు సంతకాలు చేయాల్సి ఉంటుంది. అనంతరం బాబ్లీ ప్రాజెక్టులో వరద ఎక్కువ ఉంటే గేట్లను ఎత్తే అవకాశం ఉంది.

– చక్రపాణి, ఈఈ ఎస్సారెస్పీ

శాస్త్ర సాంకేతికతకు గణితమే మూలాధారం

తెయూ(డిచ్‌పల్లి): గణితశాస్త్రం నూతన ఆవిష్కరణలో కీలక పాత్ర పోషిస్తూ సమాజంలో అన్ని శాస్త్రాలను ప్రభావితం చేస్తుందని తెయూ వీసీ టి యాదగిరిరావు పేర్కొన్నారు. డిపార్ట్‌మెంట్‌ ఆఫ్‌ మ్యాథమెటిక్స్‌, తెలంగాణ స్టేట్‌ కౌన్సిల్‌ ఆఫ్‌ సైన్స్‌–టెక్నాలజీ సంయుక్తంగా తెయూలో జాతీయ గణిత దినోత్సవం పురస్కరించుకొని 'ఇంపాక్ట్‌ ఆఫ్‌ మ్యాథమెటిక్స్‌ ఆన్‌ ఆల్ఫా జనరేషన్‌' అనే అంశంపై సోమవారం సదస్సు నిర్వహించారు. సదస్సుకు వీసీ హాజరై మాట్లాడారు. ప్రసిద్ధ గణిత శాస్త్రవేత్త రామానుజాచార్యుల ఆవిష్కరణలు ఈ ప్రపంచానికి అద్భుత ప్రగతిని అందించాయన్నారు. సదస్సులో కీలక ఉపన్యాసకులుగా కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌ మల్లారెడ్డి హాజరై ఆల్ఫా జనరేషన్‌లో గణితశాస్త్రం ప్రాధాన్యతను వివరించారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్‌ ఆరతి, వాసం చంద్రశేఖర్‌, బి శ్రీనివాస్‌, పద్మ, చంద్రశేఖర్‌, ఆచార్యులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న వీసీ యాదగిరిరావు

వైద్య కళాశాలకు మృతదేహం అప్పగింత

నిజామాబాద్‌నాగారం/ రుద్రూర్‌: అనారోగ్యంతో మృతి చెందిన కమలమ్మ మృతదేహాన్ని ఆమె కుమార్తెలు సోమవారం మెడికల్‌ కాలేజీకి అప్పగించారు. కమలమ్మ కోరిక మేరకు నేత్రాలను లయన్స్‌ కంటి ఆస్పత్రికి, మృతదేహాన్ని మెడికల్‌ కాలేజీకి ఇచ్చినట్లు లయన్స్‌ క్లబ్‌ సభ్యులు పేర్కొన్నారు. రెడ్‌ క్రాస్‌ సొసైటీ నిజామాబాద్‌ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆమె మృతదేహాన్ని ప్రయోగశాలకి ప్రొఫెసర్‌ రవీనా పాల్‌, ప్రొఫెసర్‌ బాల్‌రాజ్‌కు అప్పగించారు. ఇప్పటివరకు రెడ్‌ క్రాస్‌ ద్వారా 14 మృతదేహాలను ప్రభుత్వ వైద్య కళాశాలకు అప్పగించినట్లు జిల్లా రెడ్‌ క్రాస్‌ చైర్మన్‌ బుస్స ఆంజనేయులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తోట రాజశేఖర్‌ తెలిపారు. కమల కుమార్తెలు స్వర్ణలతా గోపి, హేమలత కృష్ణ, బంధువులు పాల్గొన్నారు.



మృతదేహాన్ని అప్పగిస్తున్న కుటుంబీకులు

సస్పెన్షన్‌ ఎత్తివేయాలని కానిస్టేబుళ్ల ర్యాలీ



బెటాలియన్‌ లో ర్యాలీ నిర్వహిస్తున్న కానిస్టేబుళ్లు

డిచ్‌పల్లి: సమస్యల సాధన కోసం ఆందోళన చేసిన కానిస్టేబుళ్లను అధికారులు సస్పెండ్‌ చేయడం తగదని, వారి సస్పెన్షన్‌ను ఎత్తివేసే వరకు ఆందోళన కొనసాగిస్తామని డిచ్‌పల్లి టీజీఎస్పీ ఏడో బెటాలియన్‌ కానిస్టేబుళ్లు అన్నారు. సోమవారం ఏక్‌ పోలీస్‌ విధానం అమలు చేయాలని, సస్పెండ్‌ చేసిన వారిని విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్‌ చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పరిపాలనా భవనం ఎదుట ఇన్‌చార్జి కమాండెంట్‌ ఎంబి సురేష్‌కు వినతిపత్రం అందజేశారు. వెంటనే రాష్ట్రవ్యాప్తంగా వివిధ బెటాలియన్‌లలో సస్పెండ్‌కు గురైన 39 మంది కానిస్టేబుళ్లను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్‌ చేశారు.

30న హ్యాండ్‌బాల్‌ ఎంపికలు

నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్‌ జిల్లా హ్యాండ్‌బాల్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో సబ్‌ జూనియర్‌ బాలికల విభాగంలో ఈ నెల 30న మాక్లూర్‌ మండలంలోని కల్లెడిలోని ప్రభుత్వ పాఠశాలలో ఉమ్మడి నిజామాబాద్‌ జిల్లా ఎంపికలు ఉంటాయని జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గంగమోహన్‌ చక్రు, పింజ సురేందర్‌లు సోమవారం తెలిపారు. క్రీడాకారులు ఉదయం 10గంటలకు హాజరు కావాలన్నారు. 01.01.2009 నుంచి 01.01.2011 మధ్య జన్మించిన వారు అర్హులన్నారు. ఎంపికైన క్రీడాకారులను నవంబర్‌ 2 నుంచి 4వరకు ఆసిఫాబాద్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి టోర్నీకి పంపనున్నట్లు పేర్కొన్నారు.

క్లుప్తంగా

కమలాకర్‌కు ఉత్తమ సేవా అవార్డు ప్రదానం



సుభాష్‌నగర్‌: నగరంలోని డి–5 సెక్షన్‌ అసిస్టెంట్‌ లైన్‌మన్‌ కమలాకర్‌కు సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించిన బహుజన సాహిత్య అకాడమీ 8వ వార్షికోత్సవంలో ఉత్తమ సేవా అవార్డును జాతీయ అధ్యక్షుడు రాధాకృష్ణ ప్రదానం చేశారు. జాతీయస్థాయిలో కమలాకర్‌కు ఉత్తమ సేవా అవార్డు రావడంపై ఏడీఈ (కన్‌స్ట్రక్షన్‌) తోట రాజశేఖర్‌, టౌన్‌–2 ఏడీఈ ప్రసాద్‌ రెడ్డి, ఏఈ అజారుద్దీన్‌, నగేశ్‌ సిబ్బంది అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో అకాడమీ తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణికి 65 ఫిర్యాదులు



నిజామాబాద్‌అర్బన్‌: ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్‌ రాజీవ్‌ గాంధీ హనుమంతు అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 65 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు, అదనపు కలెక్టర్‌ కిరణ్‌ కుమార్‌, డీఆర్డీవో సాయాగౌడ్‌, ఇన్‌చార్జి డీపీవో శ్రీనివాస్‌, నిజామాబాద్‌ ఏసీపీ రాజావెంకట్‌రెడ్డిలకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన చేసి సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్‌ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జాతీయస్థాయికి ఎంపిక

నిజామాబాద్‌నాగారం: మధ్యప్రదేశ్‌లో నవంబర్‌ 7 నుంచి 12 వరకు నిర్వహించనున్న జాతీయస్థాయి ఎస్‌జీఎఫ్‌ చాంపియన్‌షిప్‌నకు జిల్లాకు చెందిన సాయిప్రసన్న ఎంపికైంది. ఈనెల 26 నుంచి 28వ తేదీ వరకు వికారాబాద్‌లో నిర్వహించిన ఎస్‌జీఎఫ్‌ అండర్‌–14 తైక్వాండో టోర్నీలో సాయిప్రసన్న ఉత్తమ ప్రతిభకనబర్చి బంగారు పతకం సాధించింది. సాయిప్రసన్నను తైక్వాండో అసోసియేషన్‌ జిల్లా అధ్యక్షుడు బస్వా లక్ష్మీనర్సయ్య, కార్యదర్శి మనోజ్‌కుమార్‌ అభినందించారు.

'ఓలా'పై కస్టమర్ల దాడి

ఖలీల్‌వాడి: ఓలా విద్యుత్‌ బైక్‌ సంస్థపై కస్టమర్లు దాడికి పాల్పడిన ఘటన నగరంలోని వినాయక్‌నగర్‌లో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. ఓలా బైక్‌లు తరచూ రిపేర్‌కు గురవుతున్నాయని కస్టమర్లు షోరూంలో ఇవ్వడానికి వచ్చారు. ఈ క్రమంలో కస్టమర్లు, సిబ్బంది మధ్య వాగ్వావాదం చోటు చేసుకుంది. దీంతో కస్టమర్లు షోరూం అద్దాలను ధ్వంసం చేశారు. అక్కడికి వచ్చిన పోలీసులు మద్యం మత్తులో ఈ తతంగం జరిగినట్లు గుర్తించారు. షోరూం నిర్వాహకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి



మాచారెడ్డి: అనుమానాస్పద స్థితిలో ఓ యువకుడు పాల్వంచ మండలం ఇసాయిపేట శివారులో చెట్టుకు సోమవారం రాత్రి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. మాచారెడ్డి మండల కేంద్రానికి చెందిన దువ్వల బాలకృష్ణ(32) తన సొంత ఆటోతో పాల వ్యాపారం చేస్తూ జీవిస్తున్నాడు. రోజు మాదిరిగానే మాచారెడ్డి నుంచి ఇసాయిపేట అక్కడి నుంచి అక్కాపూర్‌ వెళ్లే క్రమంలో గ్రామ శివారులోని ఓ చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు గుర్తించారు. కాగా మృతుడి ఒంటిపై కొట్టిన గాయాలున్నాయని, కచ్చితంగా హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించారని కుటుంబ సభ్యులు ఆరోపించారు. బాలకృష్ణ ఆత్మహత్య చేసుకునేంత పిరికి వాడు కాదని గ్రామస్తులు, కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేశారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఘటనా స్థలానికి కామారెడ్డి రూరల్‌ సీఐ రామన్‌, మాచారెడ్డి ఎస్సై అనిల్‌ చేరుకొని కేసు దర్యాప్తు చేస్తున్నారు. క్లూస్‌ టీం, డాగ్‌ స్క్వాడ్తో గాలింపు చర్యలు చేపట్టారు.

తెరుచుకున్న మాధవనగర్‌ రైల్వేగేట్‌



నిజామాబాద్‌ రూరల్‌: మండలంలోని మాధవనగర్‌ రైల్వేగేట్‌ మూడు రోజులుగా మూసి ఉన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మూడు రోజుల పాటు రైల్వే అధికారుల ఆధ్వర్యంలో కార్మికులు ట్రాక్‌ పునరుద్ధరణ, రోడ్డు మరమ్మత్తులు చేపట్టారు. ఈ నెల 25 నుంచి 27 అర్ధరాత్రి వరకు రైల్వేగేట్‌ మూసి ఉంది. పనులు పూర్తికావడంతో సోమవారం ఉదయం నుంచి రాకపోకలు ప్రారంభమయ్యాయి.

క్రైం కార్నర్‌

అప్పిచ్చిన డబ్బులు అడిగితే కత్తితో దాడి

ఖలీల్‌వాడి: అప్పుగా ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వాలని అడిగిన వ్యక్తిపై సదరు వ్యక్తి కత్తితో దాడి చేసిన ఘటన నగరంలోని దుబ్బ ప్రాంతంలో సోమవారం ఉదయం చోటు చేసుకుంది. మూడో టౌన్‌ ఎస్సై మహేశ్‌ తెలిపిన వివరాల ప్రకారం.. దుబ్బ ప్రాంతానికి చెందిన విశ్వనాథ్‌ అలియాస్‌ ఈశ్వర్‌ వద్ద భాస్కర్‌ అనే వ్యక్తి రూ.5 వేలు అప్పుగా తీసుకున్నాడు. తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వాలని భాస్కర్‌ను విశ్వనాథ్‌ అడుగగా, అతడిపై కక్షపెంచుకున్న భాస్కర్‌ ఉదయం కత్తితో విచక్షణారహితంగా దాడి చేసి మూడో టౌన్‌ పీఎస్‌లో లొంగిపోయాడు. స్థానికులు బాధితుడు విశ్వనాథ్‌ను జీజీహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం



బాల్కొండ: రోడ్డుపై వెళ్తున్న లారీని వెనుక నుంచి మరో లారీ వేగంగా ఢీకొన్న ఘటనలో ఓ లారీ డ్రైవర్‌ క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన ఘటన ముప్కాల్‌ మండలం వేంపల్లి శివారులో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. ముప్కాల్‌ ఎస్సై రజనీకాంత్‌ తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్మూర్‌ నుంచి నిర్మల్‌ వైపు వెళ్తున్న లారీ జాతీయ రహదారిపై ఒక్క సారిగా ముందున్న వాహనాన్ని వేగంగా ఢీకొన్నది. ఈ ఘటనలో వెనుక వాహనంలో ఉన్న హర్యానకు చెందిన డ్రైవర్‌ సక్కుం అలీ క్యాబిన్‌లో ఇరుక్కుపోయి తీవ్రగాయాల పాలయ్యాడు. సుమారు రెండు గంటల పాటు పోలీసులు, తోటి డ్రైవర్లు శ్రమించి అతన్ని బయటకు తీశారు. డ్రైవర్‌ కాలు విరిగడంతో హైవే అంబులెన్స్‌లో ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

బైక్‌ను ఢీకొన్న కారు.. ఒకరి మృతి

మోర్తాడ్‌: బైక్‌ను కారు ఢీకొన్న ఘటనలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందిన ఘటన ఏర్గట్ల శివారులో సోమవారం చోటు చేసుకుంది. ఏఎస్సై లక్ష్మణ్‌ తెలిపిన వివరాల ప్రకారం.. ఏర్గట్లకు చెందిన నాగులు(45) పని నిమిత్తం బైక్‌పై బయటకు వెళ్లి తిరిగి వస్తుండగా బట్టపూర్‌ నుంచి ఏర్గట్ల వైపు వస్తున్న కారు ఏర్గట్ల శివారులో ఢీకొన్నది. ఈ ఘటనలో నాగులుకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్‌ ఆస్పత్రికి తరలించినట్లు ఏఎస్సై పేర్కొన్నారు.

కూనిపూర్‌లో చిరుత సంచారం



వర్ని: మండలంలోని కూనిపూర్‌ అటవీ ప్రాంతంలో చిరుత సంచరిస్తున్న ఆన వాళ్లను గుర్తించినట్లు గ్రామస్తులు తెలిపారు. సోమవారం ఉదయం వ్యవసాయ పనుల నిమిత్తం పొలాల్లోకి వెళ్తున్న రైతులకు గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో చిరుత పాద ముద్రలు గుర్తించారు. వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. మండలంలోని అన్ని అటవీ ప్రాంతాల్లో చిరుతల సంచారం ఉన్నందున ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని, రాత్రి సమయాల్లో అటవీ ప్రాంతాల్లోకి వెళ్లొద్దని అటవీశాఖ అధికారులు సూచించారు.

ఎల్లమ్మగుట్టలో చోరీ

ఖలీల్‌వాడి: నగరంలోని ఎల్లమ్మగుట్ట సోని ఫంక్షన్‌ హాల్‌ ఎదుట ఉన్న రాములు ఇంట్లో చోరీ జరిగినట్లు ఎస్సై శ్రీకాంత్‌ సోమవారం తెలిపారు. రాములు నాలుగు రోజుల క్రితం కుటుంబ సభ్యులతో కలిసి కామారెడ్డికి వెళ్లారు. తిరిగి వచ్చేసరికి ఇంటి తాళం పగులగొట్టి ఉండడంతో పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. ఇంట్లో ఉన్న 7 తులాల బంగారం, రూ. 20 వేల నగదు దొంగతనం జరిగినట్లు బాధితులు తెలిపారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి



రత్నయ్య(ఫైల్‌)

నాగిరెడ్డిపేట: జీవితంపై విరక్తితో పురుగుల మందు సేవించిన ఓ వృద్ధుడు చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన నాగిరెడ్డిపేట మండలంలోని మాల్తుమ్మెద గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై మల్లారెడ్డి సోమవారం తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వదల్‌పర్తి రత్నయ్య(61) గత మూడేళ్లుగా ఇంటి వద్దే ఉంటున్నాడు. అతని భార్య పద్మ కూలీ పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. ఈ క్రమంలో ఆదివారం పద్మ కూలీపనికి వెళ్లి వచ్చేసరికి రత్నయ్య ఇంటిముందున్న అరుగుపై పడుకున్నాడు. ఎంతకీ లేవకపోవడంతో పురుగులమందు సేవించినట్లు గుర్తించి చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. బాధిత కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

అనారోగ్యంతో మరొకరు..

బోధన్‌రూరల్‌: మండలంలోని చిన్న మావంది గ్రామానికి చెందిన గైని సాయి కుమార్‌ (26) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు బోధన్‌ రూరల్‌ ఎస్సై మచ్చేందర్‌ రెడ్డి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. సాయి కుమార్‌ కొంతకాలంగా అనారోగ్యానికి గురి కాగా చికిత్స పొందుతున్నాడు. ఈ నెల 27న జిల్లా కేంద్రంలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తండ్రి గంగాధర్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

మద్యానికి బానిసై ఒకరి ఆత్మహత్య

బోధన్‌రూరల్‌: మండలంలోని పెంటాఖుర్దు గ్రామానికి చెందిన గైని లక్ష్మణ్‌(28) మద్యానికి బానిసై ఆత్మహత్యకు పాల్పడినట్లు బోధన్‌ రూరల్‌ ఎస్సై మచ్చేందర్‌రెడ్డి తెలిపారు. ఎస్సై సోమవారం తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మణ్‌ కొంతకాలంగా మద్యానికి బానిసై ఇంట్లో వారితో తరచూ గొడవలు పడుతుండేవాడు. ఈ క్రమంలో ఈ 27న ఇంట్లో వారితో గొడవపడి మద్యం మత్తులో అర్ధరాత్రి ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కడుపునొప్పి భరించలేక యువకుడు..

ఎల్లారెడ్డిరూరల్‌: కడుపునొప్పి భరించలేక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఎల్లారెడ్డిమండలంలోని దావల్‌మల్కపల్లి గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై మహేశ్‌ తెలిపిన వివరాల ప్రకారం.. నిజాంసాగర్‌ మండలంలోని నర్వ గ్రామానికి చెందిన నీరుడి సతీశ్‌(35) తన అత్తగారిల్లు అయిన దావల్‌మల్కపల్లికి ఈనెల 27న వచ్చాడు. సోమవారం ఉదయం సతీశ్‌ కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు పలు చోట్ల గాలించారు. గ్రామ శివారులో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎల్లారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఎస్సై మహేశ్‌ పేర్కొన్నారు.

మహిళ హత్యకేసులో ఒకరికి జీవిత ఖైదు

ఖలీల్‌వాడి: మహిళను అత్యాచారం చేసి, హత్య చేసిన కేసులో నిందితుడు మూడ్‌ వెంకట్‌ రావుకు జీవిత కారాగార శిక్షతో పాటు పదేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ నిజామాబాద్‌ స్పెషల్‌ సెషన్స్‌ జడ్జి టి శ్రీనివాస్‌ సోమవారం తీర్పు వెలువరించారు. వివరాలు ఇలా ఉన్నాయి. వర్ని మండలంలోని రాజీపేట్‌ తండాకు చెందిన వెంకట్‌రావు ట్రాక్టర్‌ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. 2019ఫిబ్రవరి23న వర్నిలో కల్లు తాగేందుకు కల్లు దుకాణానికి వెళ్లాడు. అక్కడ ఓ మహిళ పరిచయం కాగా ఆమెతో కల్లు తాగాడు. వీరు బయటకెళ్లి మద్యం సేవించాలని నిర్ణయించుకొని ఆటో ఎక్కారు.

రాజీపేట్‌ తండాకు వెళ్లేదారిలో గూండ్ల వాగులోకి వెళ్లి మద్యం సేవించి శారీరకంగా కలిశారు. అనంతరం మరోసారి శారీరకంగా కలుద్దామని వెంకట్‌రావు బలవంతం చేయగా ఆమె డబ్బులు డిమాండ్‌ చేసింది. దీంతో కోపంలో ఆమెను కిందికి నెట్టేయడంతో కేకలు వేసింది. ఎవరైనా చూస్తారనే భయంతో ఆమె గొంతు నులిమి హత్య చేశాడు. బాధిత కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయడంతో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. విచారణలో నేరం నిర్ధారణ కావడంతో ఇండియన్‌ పీనల్‌ కోడ్‌ సెక్షన్‌ 302 హత్య నేరానికిగాను జీవిత కారాగార శిక్షతో పాటు రూ. వెయ్యి జరిమానా విధించారు. అంతేకాకుండా సెక్షన్‌ 376 అత్యాచారం నేరానికి పదేళ్ల కారాగార శిక్షతో పాటు రూ. వెయ్యి జరిమానా విధించారు. జరిమానాలు చెల్లించకుంటే అదనంగా రెండు నెలల జైలుశిక్ష అనుభవించాలని స్పెషల్‌ సెషన్స్‌ జడ్జి శ్రీనివాస్‌ తీర్పులో పేర్కొన్నారు.

తమ్ముడిపై హత్యాయత్నం.. అన్నకు మూడేళ్ల జైలు

ఖలీల్‌వాడి: తమ్ముడిపై హత్యాయత్నం చేసిన అన్నకు మూడేళ్ల జైలుశిక్ష విధిస్తూ నిజామాబాద్‌ అసిస్టెంట్‌ సెషన్స్‌ జడ్జి శ్రీకాంత్‌ బాబు సోమవారం తీర్పు వెలువరించారు. డిప్యూటీ డైరెక్టర్‌ ఆఫ్‌ ప్రాసిక్యూషన్‌ లక్ష్మీనర్సయ్య తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని నాందేవ్‌వాడకు చెందిన దుప్తల హనుమంతు, దుప్తల భీమ్‌రావు అన్నాదమ్ముళ్లు. మద్యానికి బానిసైన అన్న హనుమంతు ప్రతిరోజు మద్యం కోసం భీమ్‌రావు ఇంటికి వెళ్లి డబ్బులు అడిగేవాడు. 2023నవంబర్‌15న హనుమంతు డబ్బులు కావాలని అడిగితే భీమ్‌రావు లేవని చెప్పడంతో కత్తెరతో అన్న తన తమ్ముడి కడుపులో పొడిచాడు. దీంతో కేసు నమోదైంది. విచారణలో నేరం రుజువు కావడంతో జడ్జి శ్రీకాంత్‌ బాబు నిందితుడికి మూడేళ్ల జైలుశిక్ష విధించారు.

వృద్ధురాలి అదృశ్యం

నవీపేట: మండలంలోని మోకన్‌పల్లి గ్రామానికి చెందిన తాల్లె ముత్తెమ్మ అనే వృద్ధురాలు అదృశ్యమైనట్లు ఎస్సై వినయ్‌ సోమవారం తెలిపారు. మతిస్థిమితం లేని వృద్ధురాలు ఈనెల 26న ఇంటి నుంచి ఉదయం బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబీకులు పలు చోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. కుమారుడు గంగారాం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

తల్లి, ఇద్దరు పిల్లలు..

నవీపేట: మండలంలోని ఓ గ్రామానికి చెందిన వివాహిత తన ఇద్దరి పిల్లలతో కలిసి అదృశ్యమైనట్లు ఎస్సై వినయ్‌ తెలిపారు. సోమవారం ఉదయం ఇంట్లో ఉన్న తన భార్య కుమారుడు, కుమార్తె సాయంత్రం ఇంటికి వచ్చే సరికి లేరని భర్త తెలిపాడు. దీంతో కుటుంబీకులు బంధువులు, పలు చోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

తోపుడు బండ్లకు అగ్నిప్రమాదం



ఖలీల్‌వాడి: నగరంలోని శివాజీనగర్‌లో ఉన్న శంకర్‌ భవన్‌ స్కూల్‌ ఎదుట రెండు తోపుడు బండ్లకు అగ్ని ప్రమాదం జరిగినట్లు రెండో టౌన్‌ ఎస్సై యాసిన్‌ ఆరాఫత్‌ సోమవారం తెలిపారు. దుండగులు విద్యుత్‌ హైటెన్షన్‌ వైర్లతో బండ్లకు నిప్పు పెట్టి ఉంటారని బాధితుడు హైమ్మద్‌ చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

మారుతినగర్‌లో చోరీ

నిజామాబాద్‌ రూరల్‌: రూరల్‌ పీఎస్‌ పరిధిలోని మారుతినగర్‌లో ఉన్న శివరాం ఇంట్లో చోరీ జరిగినట్లు రూరల్‌ ఎస్‌హెచ్‌వో ఆరిఫ్‌ సోమవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. శివరాం ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి కామారెడ్డికి వెళ్లాడు. రాత్రి ఇంటికి వచ్చే సరికి చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. నాలుగు తులాల బంగారం, రూ.50వేల నగదు దొంగతనం జరిగినట్లు గుర్తించి బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

ఏటీఎంలో చోరీకి యత్నం

ఆర్మూర్‌ టౌన్‌: ఆర్మూర్‌ మున్సిపల్‌ పరిధిలోని మామిడిపల్లి చౌరస్తాలో ఉన్న పంజాబ్‌ నేషనల్‌ బ్యాంక్‌ ఏటీఎంలో దుండగులు ఆదివారం అర్ధరాత్రి చోరీకి యత్నించారు. దుండగులు ఏటీఎంలోకి చొరబడి కేబుల్‌ వైర్లను కట్‌ చేసినట్లు బ్యాంక్‌ మేనేజర్‌ సత్యనారాయణ తెలిపారు. చోరీ విషయమై మేనేజర్‌ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.